# సాక్షి వరంగల్

బుధవారం | 20 | ఆగస్టు | 2025






**కేబుల్స్ తొలగించాలి**
విద్యుత్ స్తంభాలపై తక్షణమే కేబుల్స్ తొలగించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. - 8లో▸



**కాళేశ్వరంలో వరద ఉధృతి**
కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులకు వరద ఉధృతి పెరుగుతోంది. 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. - 8లో▸

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం 31°/23°
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణంగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

# కొత్త కార్డులకు బియ్యం

**సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి పంపిణీకి సన్నాహాలు**
- ఏర్పాట్లు చేస్తున్న పౌరసరఫరాల శాఖ
- పెరిగిన లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా రేషన్ దుకాణాలకు కోటా కేటాయింపు

**ఖిలా వరంగల్:** రేషన్‌కార్డుల కోసం 11 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పేదల కల నెరవేరింది. జూలై 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించిన విషయం తెలిసిందే. జిల్లాలో లబ్ధిదారులకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రేషన్‌కార్డులు అందించారు. దీంతో వారి మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్త కార్డుదారులకు సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీకి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జూన్‌లో మూడు నెలల రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేసింది. దీంతోపాటు మూడు నెలలుగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల జారీతోపాటు ఉన్న కార్డుల్లో సభ్యుల పేర్లను నమోదు చేసింది. జిల్లాలో పెరిగిన ఆహారభద్రతా కార్డుల్లోని సభ్యుల సంఖ్యకు అనుగుణంగా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



స్టేజ్-1 నుంచి ఎంఎల్ఎల్ పాయింట్‌కు వచ్చిన సన్నబియ్యం లోడ్ లారీ

**ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్‌షాపులకు బియ్యం..**
కొత్త రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి యథావిధిగా పాత కార్డులతోపాటు కొత్త కార్డులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు సెప్టెంబర్ నెల కోటాకు సంబంధించిన సన్న బియ్యం కేటాయించింది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్‌షాపులకు బియ్యం తరలింపునకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం చౌకధరల దుకాణాలు, మండలస్థాయి గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యానికి తోడు అదనంగా కావాల్సిన బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. కొత్తకార్డుల పంపిణీకి ముందు ప్రతి నెల సుమారు 509 షాపుల ద్వారా 2,66,429 కార్డులకు 50,14,541 మెట్రిక్ టన్నులు బియ్యాన్ని పంపిణీ చేశారు. పెరిగిన లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా జిల్లాకు 53,82,518 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

| జిల్లాలో రేషన్‌కార్డులు, దుకాణాలు, బియ్యం వివరాలు.. |
| --- |
| రేషన్ దుకాణాలు : 509 |
| పాతకార్డులు : 2,66,429 |
| కొత్తకార్డులు : 16,251 |
| ఎంఎల్ఎస్ పాయింట్లు : ఏనుమాముల, నర్సంపేట, వర్ధన్నపేట |
| పంపిణీ చేయాల్సిన బియ్యం : 5,382,518 మెట్రిక్ టన్నులు |

**జిల్లాలో మూడు ఎంఎల్ఎస్ పాయింట్లు..**
వరంగల్ జిల్లాలో ఏనుమాముల, వర్ధన్నపేట, నర్సంపేట ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి 13 మండలాల్లోని 509 రేషన్ షాపులకు బియ్యం చేరనున్నాయి. స్టేజ్-1 గోదాముల నుంచి ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్లకు సన్న బియ్యం నిల్వలు రాక ప్రారంభమైంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నేరుగా రేషన్ షాపులకు సన్నబియ్యం పంపేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

**కొత్త కార్డు రావడం ఆనందంగా ఉంది..**



సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారు. రేషన్‌కార్డు కోసం 11 సంవత్సరాలుగా ఎదురుచూశాం. కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తు చేసుకున్నాం. అధికారులు సర్వే చేసి మాకు కార్డు మంజూరు చేశారు. నాపేరు, భర్త, ఇద్దరు పిల్లల పేర్లతో కూడిన కార్డు మాకు వచ్చింది. సెప్టెంబర్ నెల నుంచి నలుగురికి 24 కిలోల బియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయం. నాకుటుంబానికి కొత్త కార్డు రాడడం ఎంతో ఆనందంగా ఉంది.

- భార్గవి, తిలక్‌రోడ్డు కాశిబుగ్గ, వరంగల్

**అందరికి సన్నబియ్యం పంపిణీ చేస్తాం..**



పాత, కొత్త రేషన్‌కార్డులు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి సెప్టెంబర్ నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తాం. కార్డుల్లో పేరు నమోదు చేసుకున్న వారికి సైతం బియ్యం పంపిణీ చేయనున్నాం. జిల్లాలోని ఎనుమాముల, నర్సంపేట, వర్ధన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం చేరుతున్నాయి.

- కిష్టయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

## తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, భారత ప్రభుత్వ రక్షణశాఖ సలహాదారు జి.సతీశ్‌రెడ్డి, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, సీహెచ్.మోహన్‌రావు తదితరులు

తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా కేయూ ఆడిటోరియంలో మంగళవారం తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఈ సైన్స్ కాంగ్రెస్ జరగనుంది. 'ఇన్నోవేటివ్ స్కిల్స్ ఫర్ ఎంపవర్‌మెంట్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా పోకల్' అనే థీమ్‌పై ఈ సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, భారత రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ సైంటిస్టులు, పరిశోధకులు, ప్రొఫెసర్లు, ప్రతినిధులు హాజరై పలు అంశాలపై ప్రసంగించారు.

- కేయూ క్యాంపస్ - వివరాలు 8లో▸

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**ఖానాపురం:** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రం శివారులో మంగళవార రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మనుబోతులగడ్డ గ్రామానికి చెందిన దున్నపోతుల సంజీవ కుమారుడు వ్యాసు (21) నర్సంపేటలోని జయముఖి కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై నర్సంపేటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఖానాపురం శివారులోని బ్రిడ్జిపైకి రాగానే నర్సంపేట నుంచి ఖానాపురం వైపు వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై రఘుపతి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వ్యాసు మృతితో కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



వ్యాసు(ఫైల్)

## న్యూస్‌రీల్

### సీపీని కలిసిన క్రైం డీసీపీ
**వరంగల్ క్రైం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన గుణశేఖర్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పూలమొక్క అందజేశారు. కమిషనరేట్ పరిధిలో చోరీలను నియంత్రించడంతో పాటు పెండింగ్ కేసుల్లో పట్టుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై సీపీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు.

### నానో యూరియాతో లాభాలు : డీఏఓ



**రాయపర్తి:** నానో యూరియాతో రైతులకు లాభాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి కె.అనురాధ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు దాసరి మహేందర్ వ్యవసాయక్షేత్రంలో మంగళవారం నానో యూరియా క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నానో యూరియాకు ధర తక్కువ అని, డ్రోన్‌తో సులభంగా పిచికారీ చేయవచ్చని చెప్పారు. యూరియా, నానో యూరియాకు తేడాపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్‌నాయక్, మండల వ్యవసాయాధికారి గుమ్మడి వీరభద్రం, సొసైటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, సీఈఓ సోమిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### లక్ష్యాన్ని సాధించాలి
**న్యూశాయంపేట:** వనమహోత్సవంలో భాగంగా అధికారులు నిర్దేశిత లక్ష్యాన్ని వారంలోగా సాధించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓ కృష్ణమూర్తితో కలిసి మంగళవారం వనమహోత్సవంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లక్ష్యం 31,04,272 కాగా.. ఇప్పటి వరకు 21,85,252 మొక్కలు నాటినట్లు తెలిపారు. 10,29, 230 మొక్కలకు జియోట్యాగింగ్, మేరీ లైఫ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తూ వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సాయిచరణ్

**ఖానాపురం:** రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని బుధరావుపేట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సాయిచరణ్ ఎంపికైనట్లు పీఈటీ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఈనెల 18 నుంచి రంగారెడ్డిలో రాష్ట్రస్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో సాయిచరణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో ఆయనను ఉపాధ్యాయులు, పీఈటీ అభినందించారు.

### ఇనుప స్తంభానికి విద్యుత్



**దుగ్గొండి:** తిమ్మంపేటలోని నారాయణతండా రోడ్డులో నరహరి సాంబరెడ్డి వ్యవసాయ బావి వద్ద ఉన్న ఇనుప స్తంభానికి ఎర్త్ పాసై విద్యుత్ సరఫరా అవుతోందని రైతులు పేర్కొంటున్నారు. వంగిపోయి 11కేవీ, ఎల్‌టీ లైన్లు ఉన్న ఈ స్తంభంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సిమెంట్ స్తంభం ఏర్పాటు చేసి, తీగలు సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

### ఉపాధి హామీ డబ్బులు రికవరీ చేయాలి
**నర్సంపేట:** ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవకతవకలపై డబ్బులను రికవరీ చేయాలని డీఆర్డీఓ కౌసల్యాదేవి ఆదేశించారు. చెన్నారావుపేట మండల కేంద్రంలో మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్పీ, డీఆర్పీలు ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్ నివేదికలను డీఆర్‌డీఓకు సమర్పించారు. నివేదికల ఆధారంగా ప్రోగ్రాం ఆఫీసర్, ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.46,527 రికవరీ చేయాలని డీఆర్డీఓ ఆదేశించారు. రికవరీ కింద డబ్బులు చెల్లించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 444 బస్తాల యూరియా.. రెండు వేల మంది రైతులు!



యూరియా కోసం క్యూలో బారులుదీరిన రైతులు

- క్యూలైన్‌లో తోపులాట.. పంపిణీ నిలిపివేసిన అధికారులు
- కల్లెడ గ్రామంలో నిరాశతో వెనుదిరిగిన రైతులు

**పర్వతగిరి:** యూరియా కోసం క్యూలో ఉన్న రైతుల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో అధికారులు పంపిణీ నిలిపివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పర్వతగిరి పీఏసీఎస్ పరిధిలోని కల్లెడ గ్రామానికి మంగళవారం 444 బస్తాల యూరియా రాగా.. రెండు వేల మంది రైతులు బారులుదీరారు. వంద మంది రైతులకు అధికారులు కూపన్లు పంపిణీ చేసి మిగిలిన వారిని క్యూలో ఉండమని సూచించారు. ఎక్కువ మంది రావడంతో రైతుల మధ్య తోపులాట జరిగింది. గమనించిన పీఏసీఎస్ సీఈఓ సురేశ్, వ్యవసాయ శాఖ అధికారి ప్రశాంత్ కుమార్, ఎస్సై బోగం ప్రవీణ్ తక్షణమే కూపన్లు, యూరియా పంపిణీ నిలిపివేశారు. దీంతో రైతులు నిరాశకు గురై వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కూపన్లు ఇచ్చి యూరియా బస్తాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సీఈఓ సురేశ్‌ను వివరణ కోరగా గత ఏడాది ఈ సమయం వరకు 15 లారీల యూరియా రాగా.. ఈ ఏడాది 8 లారీల యూరియా మాత్రమే వచ్చిందని తెలిపారు. వారానికి ఒక లారీ రావాల్సి ఉండగా.. 25 రోజులకు ఒక లారీ రావడంతో రైతులు యూరియా కోసం బారులుదీరుతున్నారని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి టోకెన్లు ఇచ్చి యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేస్తామని ఏఓ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.



దుగ్గొండి: మందపల్లి పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం రైతుల ఎదురు చూపులు

**గ్రోమోర్ షాపు ఎదుట పడిగాపులు..**
**వర్ధన్నపేట:** యూరియా కోసం మండల కేంద్రంలోని గ్రోమోర్ షాపు ఎదుట రైతులు మంగళవారం క్యూలైన్‌లో పడిగాపులు కాయాల్సి వచ్చింది. వారం రోజులుగా యూరియా దొరకడం లేదని, పంట సాగుకు సరిపోక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మందపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద..**
**దుగ్గొండి:** యూరియా కోసం మందపల్లి పీఏసీఎస్ కార్యాలయానికి రైతులు భారీగా తరలివచ్చారు. ప్రతి రైతుకు రెండు బస్తాల చొప్పున అందించారు. మండల వ్యవసాయ అధికారి మాధవి మాట్లాడుతూ అపోహతోనే రైతులు యూరియా నిల్వ చేసుకోవడంతో కొరత ఏర్పడుతోందని తెలిపారు. మండలానికి ఇప్పటివరకు 1336 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఇంకా 30 టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు.

# యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద

**రాయపర్తి:** యూరియా సరఫరాలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌తోపాటు ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులను కలెక్టర్ వ్యవసాయాధికారులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. షాపుల్లోని యూరియా, ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ షాపులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా పంపిణీ సక్రమంగా చేపట్టాలని సూచించారు. యూరియా కోసం పురుగుమందులు, ఇతర వస్తువులను అంటగడుతున్నారని కలెక్టర్ ఎదుట రైతులు వాపోయారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు అలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. యూరియా బస్తాలను పక్కదారి పట్టించి కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. షాపుల వద్ద అధికారులు ఉండి యూరియా పంపిణీ పర్యవేక్షించాలని సూచించారు. యూరియాకు బదులు ప్రత్యామ్నాయంగా నానో యూరియా పంటలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని, 45 కిలోల యూరియా బస్తాకు సమానంగా 500 మిల్లీలీటర్ల నానో యూరియా సరిపోతుందని రైతులకు అవగాహన కల్పించారు.



రాయపర్తి : పీఏసీఎస్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

**ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన..**
మండల కేంద్రం, పెర్కవేడు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో వైద్యశిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన కూరగాయలు, పండ్లు అందించాలని ఆదేశించారు. భోజనం ఎలా ఉందని బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, డీఎంహెచ్ఓ సాంబశివరావు, గృహనిర్మాణ శాఖ పీడీ గణపతి శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ గుగులోత్ కిషన్‌నాయక్, ఏఓ గుమ్మడి వీరభద్రం ఉన్నారు.

## భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి

- ఆర్డీఓలు, తహసీల్దార్ల వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

**న్యూశాయంపేట:** భూ భారతి దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్ నుంచి మంగళవారం జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారంలోగా పరిష్కరించలేని దరఖాస్తుల వివరాల నివేదికను తయారుచేయాలని తహసీల్దార్లకు సూచించారు. రెవెన్యూ రికార్డుల భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని, తహసీల్దార్ల కార్యాలయాల్లో విధిగా రిజిస్టర్లు, బయోమెట్రిక్ అటెండెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. ఆర్డీఓల పరిధిలోని తహసీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు, పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, ఏఓ విశ్వప్రసాద్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, తహసీల్దార్లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

## కాజీపేట దర్గా ఉర్సు షురూ

- రేపు అర్ధరాత్రి గంధంతో ప్రధాన ఉత్సవం ప్రారంభం

**కాజీపేట రూరల్:** కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. క్రీస్తుశకం 1865లో సఫర్ 26న హజరత్ భగవంతునిలో లీనమైన దినాన దర్గాను నిర్మించి ఉర్సు ఉత్సవాలను ఆరంభించి నేటికి కొనసాగిస్తున్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు. హిజ్రీ క్యాలెండర్ ప్రకారం ప్రతీ సఫర్ నెలలో ఉత్సవాలు జరుగుతాయని, హిందూ, ముస్లిం సమైక్యతకు హజరత్ సయ్యద్ షా అఫ్జల్‌బియాబానీ దర్గా ఉత్సవాలు ప్రత్యేకతను చాటుతున్నాయని చరిత్ర చెబుతోంది. దర్గాను దర్శించుకొని ప్రార్థనలతో వేడుకుంటే తమ సమస్యలు, బాధలు పోయి అనుకున్నవి జరుగుతాయని ప్రజలు నమ్మకం. ఈ ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి కులమత భేదం లేకుండా లక్షలాది మంది వస్తారని దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా తెలిపారు.

**రేపు చందనోత్సవం**
ఉర్సులో భాగంగా బియాబాని సమాధిని రోజ్ వాటర్‌తో శుద్ధి చేస్తారు. 21న గురువారం అర్ధరాత్రి గంధం (సందల్) వేడుక ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తుంది. బడేఘర్ వద్ద ఖుస్రూపాషా కుటుంబీకులు ఆనవాయితీగా స్వయంగా గంధం చెక్కలతో గంధాన్ని తయారు చేస్తారు. ఆ రోజు రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు సందల్ వేడుకలో ఖుస్రు పాషా వెండి పాత్రలో గంధం లేపనం, వస్త్రాలను, రోజ్‌వాటర్‌ను గుర్రాలు, బ్యాండ్ మేళతాళాలతో భక్తుల మధ్య ఊరేగింపుగా తీసుకొస్తారు. రోజ్ వాటర్‌తో బియాబానీ సమాధిని శుద్ధిచేస్తారు.

# వివాహిత ఆత్మహత్య

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసగించి పెళ్లి చేసుకున్నాడని మనస్తాపం
- నర్సినాయక్‌తండాలో బలవన్మరణం

**నర్సంపేట రూరల్:** సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలం నర్సినాయక్ తండాకు చెందిన అజ్మీరా వీరమ్మ కుమార్తె సునీత (28) పీజీ చదివింది. 18 నెలల క్రితం చక్రం తండాకు చెందిన భూక్యా భద్రుతో సునీతకు వివాహమైంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నానని చెప్పి సునీతను భద్రు వివాహం చేసుకున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కాకుండా వేరే ఉద్యోగం చేస్తుండడంతో ఇరువురి మధ్య గొడవలు జరిగాయి. దీంతో ఆమె పుట్టింటికి వచ్చి ఉంటోంది. ఈ విషయమై పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ సైతం చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. తీవ్ర మనోవేదనకు గురైన సునీత మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తండాలో వెతికినా ఆచూకీ లభించలేదు. చివరికి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో సునీత మృతదేహం కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అరుణ్‌కుమార్ బావి నుంచి ఆమె మృతదేహాన్ని బయటకు తీయించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.



సునీత (ఫైల్)

## నకిలీ వైద్యకేంద్రాల్లో తనిఖీలు

**ఎంజీఎం:** నగరంలోని కాశిబుగ్గ ప్రాంతంలో అర్హత లేకుండా నిర్వహిస్తున్న నకిలీ వైద్యకేంద్రాలపై మంగళవారం రాత్రి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుల బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన మామిడి ఈశ్వరయ్య అనే వ్యక్తి ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ డాక్టర్ అని పోస్టర్ పెట్టుకుని ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా చెలామణి అవుతూ రోగులను మోసం చేస్తున్నట్లు సభ్యులు వెల్లడించారు. చట్టవిరుద్ధంగా అనుమతి లేకుండా త్రివేణి క్లినిక్ నడుపుతున్నాడని తెలిపారు. ఎస్.నయీమ్ అనే వ్యక్తి ఎక్స్‌రే టెక్నీషియన్ చదివి హిజమా స్పీకింగ్ థెరపీ పేరుతో అనుమతి లేని డిగ్రీలు పెట్టుకుని పడకలు ఏర్పాటు చేసి సెలైన్ పెట్టడం, అధిక మోతాదు స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్స్ రోగులకు ఇస్తున్నట్లు గుర్తించారు.

## లోటు నుంచి అధికం

- జిల్లాలో దంచికొడుతున్న వానలు
- అదనంగా 27 శాతం వర్షపాతం

**సాక్షి, వరంగల్:** రైతులకు కావాల్సిన వాన ఆగస్టు నెల అందించింది. జూన్, జూలై నెలలో అడపాదడపా వర్షాలు కురిశాయి. ఈ నెలలో మాత్రం లోటు వర్షపాతం నుంచి అధిక వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, వాగులు, వంకలు, కుంటలు జలకళ సంతరించుకుంటున్నాయి. జూన్ నుంచి ఆగస్టు 18 వరకు నమోదైన వర్షపాతం గణాంకాలు చూస్తే వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సాధారణం మించి ఎక్కువగానే నమోదైంది. ముఖ్యంగా వరంగల్ జిల్లాలో అదనంగా 27 శాతం వర్షపాతం నమోదైతే, హనుమకొండ జిల్లాలో మాత్రం ఒక శాతం మాత్రమే నమోదైంది. వరంగల్ జిల్లాలో జూన్‌లో లోటు వర్షపాతం ఉంటే జూలైలో కురవాల్సిన దానికంటే అదనంగా కురిసింది. ఆ రెండు నెలలు కలిపితే సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో రైతులు ఆందోళన చెందారు. ఆగస్టులో 576.6 మిల్లీమీటర్ల వర్షం అవసరం ఉండగా 730.5 మిల్లీమీటర్ల వాన కురిసింది. జిల్లాలో ప్రధాన జలాశయమైన పాకాల సరస్సు నిండకుండలా మారి మత్తడిపోస్తోంది. హనుమకొండ జిల్లాలో జూన్, జూలై నెలలో అనుకున్నంత వర్షాలు లేవు. ఆగస్టు నెలలో జిల్లాలో 541.3 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 546.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పరకాలలోని చలివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇతర చెరువులు, కుంటలు కూడా నిండుతున్నాయి. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రికార్డు స్థాయి వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ విభాగాధికారులు అంటున్నారు.

## కాళేశ్వరంలో వరద ఉధృతి



కాళేశ్వరం వద్ద పుష్కర ఘాట్లను తాకుతూ గోదావరి, ప్రాణహితల వరద ఉధృతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులకు వరద ఉధృతి పెరుగుతోంది. మంగళవారం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 10.680మీటర్ల ఎత్తులో నీటిమట్టం పెరిగి దిగువకు తరలిపోతుంది. ఎగువన కడెం, ఎల్లంపల్లినుంచి గోదావరి మీదుగా అన్నారం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 1.21లక్షల క్యూసెక్కులను 66 గేట్లు ఎత్తి దిగువకు కాళేశ్వరం వైపుకు తరలిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో 6.65లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఎగువ గోదావరి, ప్రాణహిత నదుల గుండా తరలి వస్తుంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు ఔట్‌ఫ్లో రూపంలో తరలిస్తున్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బాపు (ఫైల్)

కాటారం: పంట సాగు కోసం అప్పు తెచ్చి పెట్టుబడి పెడితే వర్షాలకు పంట సరిగా లేదని పెట్టుబడి తిరిగి చేతికి రాదనే మనోవేదనతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుషాపూర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లి బాపు(38), దేవక్క దంపతులు తమ ఎకరం భూమిలో వ్యవసాయం, ఇతరులకు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది బాపు తన ఎకరం భూమిలో పత్తి పంట సాగు చేసి రూ.70 వేలు పెట్టుబడి కోసం అప్పు చేశాడు. వర్షాల కారణంగా పత్తి పంట దెబ్బతిన్నది. దీంతో పెట్టుబడి చేతికి రాలేని పరిస్థితి ఉందని బాపు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో బాపు వ్యవసాయ పనుల నిమిత్తం రూ.1.20 లక్షలు పెట్టి ఎద్దులను కొనుగోలు చేయగా రూ.40 వేలు చెల్లించి మిగితా రూ.80 వేలకు సదరు యజమానిని సమయం కోరాడు. సోమవారం ఎద్దులు విక్రయించిన వ్యక్తి తనకు డబ్బులు అత్యవసరమని ఇంటికి రాగా పది రోజులకు ఇస్తానని చెప్పి పంపించాడు. ఈనేపథ్యంలో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు రూ.70 వేలు, ఎద్దుల బాకీ రూ.80 వేలు చెల్లించే దారిలేకపోవడంతో తీవ్రమనోవేదనతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య దేవక్క గమనించి కేకలు వేయగా చుట్టు పక్కల వారు వచ్చి బాపును చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాపు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్యతోపాటు పిల్లలు గ్రీష్మా, రిషివర్ధన్, అఖిల్ ఉన్నారు. దేవక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

# ఆవిష్కరణలు దేశానికి ఆదర్శం

**యువతకు ఆలోచనలే కీలకం**
- డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్, భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి
- కేయూలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం



మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

కేయూ క్యాంపస్: విద్యార్థులు, యువత ఆవిష్కరణలు దేశానికి ఆదర్శమని డీఆర్డీఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవం సందర్భంగా తెలంగాణ అకాడమీ సైన్సెస్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా మూడు రోజులపాటు నిర్వహించే తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ మంగళవారం క్యాంపస్‌లోని ఆడిటోరియంలో ప్రారంభమైంది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇన్నోవేటివ్ స్కిల్స్ అండ్ ఎంపవర్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సైన్స్ కాంగ్రెస్ నిర్వహండం అభినందనీయమన్నారు. ప్రతి రాష్ట్రంలో ఐఐటీ, ఐఐఎం, ఎఐఎంఎస్, నిట్స్ సెంట్రల్ యూనివర్సిటీలు ఉండడం వల్ల అనేక మంది విద్యార్థులు ఆవిష్కరణలు, పరిశోధనాపత్రాల ప్రచురణలో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం 75శాతం విద్యార్థులు విదేశాలనుంచి తిరిగి వచ్చి మాతృభూమిలో ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ పూర్తిచేసిన 90శాతం మంది ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. తమ గ్రామం నుంచి తానొక్కడే ఇంజనీరింగ్ పూర్తి చేసినట్లు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం 1.75మిలియన్ స్టార్టప్స్ వచ్చాయన్నారు. ఏ గ్రామం, ఏ కుటుంబం నుంచి వచ్చామనేది ముఖ్యంకాదని ఏ ఆలోచన దృక్పథంతో ముందుకెళ్తున్నామన్నదే ముఖ్యమన్నారు. యువత మైండ్‌సెట్ మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ సాంకేతికతతో పోటీపడే మనస్తత్వం రావాలన్నారు.





కార్యక్రమంలో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, వేదికపై పలువురు అతిథులు

**సావనీర్, రెండు పుస్తకాలు ఆవిష్కరణ**



తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సావనీర్ ఆవిష్కరిస్తున్న సతీష్‌రెడ్డి, ఇతర అతిథులు

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో సావనీర్, రెండు పుస్తకాలను డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, టాస్ అధ్యక్షుడు మోహన్‌రావు, జనరల్‌సెక్రటరీ సత్యనారాయణ, వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం తోకలిసి ఆవిష్కరించారు.

**టీబీ నియంత్రణకు నూతన ఔషధాలు**

టీబీ నియంత్రణకు నూతన ఔషధాల అభివృద్ధి తప్పనిసరి అని హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె నందుకూరి వెల్లడించారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో 'టీబీ మెకానిస్టిక్ ఇన్‌సైట్స్ ఇన్ టూ హౌది పాజిటివ్ పాథోజెన్ సర్వైవ్స్ ఇన్‌ది హోస్ట్' అనే అంశంపై ఆయన మాట్లాడారు. ట్యూబర్క్యులోసిస్‌కు కారణమైన మైక్రోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ (ఎంటీబీ)లో ఔషధ నిరోధకత పెరుగుతుందన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్లు, విద్యార్థులు

**సెరికల్చర్ విద్యార్థుల ప్రదర్శన**



ప్రదర్శనలో విద్యార్థులు

కాకతీయ యూనివర్సిటీలోని ఆడిటోరియం వద్ద సెరికల్చర్ విద్యార్థుల పట్టుపురుగుల ప్రదర్శన ఆకట్టుకుంది. డాక్టర్ సుజాత విశిష్టతను వివరించారు. మల్బరీ నాన్‌మల్బరీ గూడి పట్టు చీలుకులపై బోధన, పెంపకం, పరిశోధనపై నిర్వహించే అంశాలపై వివరించారు. ఇదిలా ఉండగా.. సెనెట్‌హాల్‌లో విద్యార్థులు, సైంటిస్టులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, విజ్ఞాన్‌ప్రసాద్, రామచంద్రయ్య, లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్‌గా ఆచార్య జ్యోతి పాల్గొన్నారు.

**సామాజిక పరివర్తనానికి సైన్స్ సాధనం**



సామాజిక పరివర్తనకు సైన్స్ ఒక సాధనమని టాస్ అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రావు అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా అకాడమీ సైన్సెస్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు క్రిటికల్ థింకింగ్ నైపుణ్యాలు కలిగి ఉండాలని సూచించారు. మన రక్షణవ్యవస్థ బలమైందని ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలిసిందని, కోవిడ్‌తో మన శాస్త్రపరిజ్ఞానం ప్రపంచానికి తలమానికమైందని పేర్కొన్నారు. దేశాభివృద్ధి టెక్నాలజీపై ఆధారపడి ఉందని తెలిపారు. తాను కేయూ పూర్వవిద్యార్థినని గుర్తు చేసుకున్నారు.

**యువత నైపుణ్యాల ద్వారా సాధికారత**



యువత నైపుణ్యాల ద్వారా సాధికారత సాధిస్తారని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. భారతీయ యువత విద్య, వైజ్ఞానిక పరంగా ప్రపంచానికి పోటీ ఇస్తున్నారని తెలిపారు. సైన్స్ అనేది ఒక క్రమబద్ధమైన అధ్యయనమని పేర్కొన్నారు. దేశ జనాభాలో 60శాతం యువత ఉండడం గర్వకారణమన్నారు. డిగ్రీతోనే ఉద్యోగాలు వచ్చే పరిస్థితులు లేవని మల్టీ డిసిప్లినరీ కోర్సుల్లో స్కిల్స్ ఉండాల్సిందేనని అన్నారు.

**సంక్షేమమే సేవ సైన్స్ లక్ష్యం**

సంక్షేమమే సేవ సైన్స్ లక్ష్యం కావాలని కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. క్వాంటం ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నూతన నూతనశాస్త్ర సాంకేతికరంగాల్లో ముందుకెళ్తున్నామన్నారు. స్వర్ణోత్సవంలోనికి అడిగిడిన సందర్భంగా టాస్‌తో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేయూలో రూసా ప్రాజెక్టు కింద రూ.50 కోట్లు మంజూరు కాగా.. అందుకు సంబంధించిన పరిశోధనలు, ప్రాజెక్టులపై ఆచార్యులు దృష్టిసారించారని తెలిపారు. అక్టోబర్‌లో కేయూలోని కె హబ్‌తో టీ హబ్ ఎంఓయూ జరిగి ఇన్నోవేషన్ ఇంక్యూబేషన్, స్టార్టప్‌లతో ముందుకెళ్లనున్నట్లు చెప్పారు. కేయూ టాస్ జనరల్ సెక్రటరీ, ఓయూ మాజీ వీసీ సత్యనారాయణ మాట్లాడుతూ యువత సైన్స్ అండ్ టెక్నాలజీతో నూతన ఆవిష్కరణల దిశగా ముందుకెళ్లాలని సూచించారు. రిజిస్ట్రార్ రాంచంద్రం, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య వెంకట్రామ్‌రెడ్డి, టాస్ ట్రెజరర్ ప్రొఫెసర్ ఎస్ఎంరెడ్డి మాట్లాడారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

**ఆధునిక రక్షణ, సాంకేతికల అభివృద్ధి**

దేశ అభివృద్ధిలో రక్షణ, సాంకేతికతల పాత్ర ఎంతో కీలకమని బెంగళూరు డీఆర్‌డీఏ ఎల్ఆర్‌డీఈ డైరెక్టర్ విశ్వం అన్నారు. రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి, ప్రభుత్వ పెట్టుబడులు, శాస్త్రసాంకేతిక పురోగతికి.. ఆధునిక రక్షణ అవసరాలకు ఎంతో అవసరమని తెలిపారు. 'ఆర్‌అండ్‌డీ డిఫెన్స్ టెక్నాలజీస్ అపార్చునిటీస్ అండ్ చాలెంజెస్–ఏ 2047 పర్స్పెక్టివ్స్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు.

## జనగామలో రూ.కోటితో వ్యాపారి పరారీ

- దివాలా తీయించిన వ్యాపారం, ఆన్‌లైన్ రమ్మీ..?

జనగామ: జనగామ పట్టణంలో ఓ వ్యాపారి రూ.కోటికిపైగా అప్పులు చేసి పరారైన సంఘటన కలకలం రేపుతోంది. వ్యాపారం పేరిట అప్పులు తీసుకున్న సదరు వ్యక్తి అందులో నష్టపోవడంతో పాటు ఆన్‌లైన్ రమ్మీకి అలవాటుపడి భారీ మొత్తాన్ని కోల్పోయినట్లు ప్రచారం జరుగుతోంది. అప్పుల భారం, వ్యాపారం పూర్తిగా దివాలా తీయడంతో రెండు రోజుల క్రితం రాత్రిపూట ఉడాయించాడు. దీంతో ఆయనను నమ్మి డబ్బులు ఇచ్చిన వ్యాపారులు, సామాన్య వ్యక్తులు ఆందోళనకు గురవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రేయిన్ మార్కెట్ ఏరియాకు చెందిన వ్యాపారి సూర్యపేట రోడ్డులో పంట ఉత్పత్తుల కొనుగోలు(చిల్లర కాంటా దుకాణం) సెంటర్ ద్వారా చింతపండు, చింతగింజలు, వేప, కందులు, పెసర్ల ద్వారా మారు వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత ఏడాది వ్యాపారి క్వింటాకు రూ.7వేల చొప్పున పెద్ద ఎత్తున కందులను కొనుగోలు చేసి నిల్వచేయగా, ధర ఒక్కసారిగా పడిపోవడంతో 40 శాతం తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది. దీనికి తోడు ఆన్‌లైన్ రమ్మీ ప్రభావం మరింత నష్టాల వైపు తీసుకెళ్లినట్లు పలువురు వ్యాపారులు మాట్లాడుకుంటున్నారు. రూ.2 నుంచి రూ.3 వడ్డీతో రూ.కోటి వరకు అప్పులు ఇవ్వగా.. ఒకరిద్దరు మాత్రం రూ.10లక్షల నుంచి రూ .20లక్షల ఇచ్చినట్లు సమాచారం. నెలనెలా వడ్డీ వస్తుందనే ఆశతో రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు అప్పుచ్చిన సామాన్య కుటుంబాలు, పరపతి సంఘాల ప్రతినిధులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వ్యాపారి ఉడాయించిన ఘటన నేపథ్యంలో సదరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలా.. వద్దా.. అనే ఊగిసలాటలో ఉన్నారు.

**మితిమీరుతోన్న ఆన్‌లైన్ రమ్మీ..**

జనగామలో ఆన్‌లైన్ రమ్మీ గేమింగ్ మితిమీరుతోంది. పట్టణంలోని ప్రధాన కాలనీలు అడ్డాగా పలువురు ఏజెంట్లు హైదరాబాద్ కేంద్రంగా ఆన్‌లైన్ రమ్మీ గేమింగ్ నడిపిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. పలువురు వ్యాపారులు, విద్యార్థులు, యువత, సామాన్యులను ప్రలోభాలకు గురిచేస్తూ ఆన్‌లైన్ రమ్మీకి బానిసలుగా మార్చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

## 24న చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మంటపంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్–7, 9, 11, 13, 15 బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## ఒంటరి జీవితం గడపలేక..

- యువతి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



మేఘన (ఫైల్)

గార్ల: 10 ఏళ్ల క్రితం తండ్రి, 2 ఏళ్ల క్రితం తల్లి మృతి చెందడంతో మనోవేదనకు గురైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మానుకోట జిల్లా గార్ల మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పినిరెడ్డిగూడేనికి చెందిన గుగులోత్ మేఘన (17) హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతుంది. రాఖీ పండుగ సందర్భంగా ఇంటికి వచ్చిన యువతి అమ్మనాన్న చనిపోవడంతో మానసికంగా కృంగిపోయింది. అన్నతోపాటు, బాబాయి కుమారులకు రాఖీ కట్టిన అనంతరం ఇంటికి చేరిన ఆమె తన ఆలనాపాలనా చూసుకునే తల్లిదండ్రులు లేరని బాధపడుతూ బాత్‌రూమ్ క్లీనర్ తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన బంధువులు బైక్‌పై గార్ల సీహెచ్‌సీకి తీసుకొచ్చి ప్రథమచికిత్స అనంతరం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి సెలైన్‌తోనే బైక్‌పై తీసుకెళ్తుండగా మార్గమధ్యలో వచ్చిన 108 అంబులెన్స్‌లో తరలించారు. వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందింది. మేఘన సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రియాజ్‌పాషా వెల్లడించారు.



## విద్యుత్ స్తంభాలపై కేబుల్స్ తొలగించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



వీసీ సమావేశంలో మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

హన్మకొండ : విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లను తొలగించాలని ఏడాది కాలంగా కేబుల్ ఆపరేటర్లకు సూచించినా పెడచెవిన పెడుతున్నారని, అన్ని సర్కిళ్ల ఎస్ఈలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వాటిని తొలగించాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజర్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి అనుగుణంగా కేబుల్ వైర్లు రీ–అలైన్‌మెంట్ చేసుకోవాలని కేబుల్ ఆపరేటర్లకు సూచించారు. స్పందించకపోతే వాటిని తొలగించాలని ఎస్ఈలు, డీఈలకు సూచించారు. ప్రజల భద్రత ముఖ్యమని అన్నారు. ఒక పద్ధతి ప్రకారం కేబుల్ వైర్లు అమర్చుకోవాలని సూచించారు. అధికారులు వినాయక విగ్రహాల తయారీ కేంద్రాలను సందర్శించి ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ లైన్లను క్రమబద్ధీకరించాలన్నారు. అధిక ఎత్తులో ఉన్న వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ లైన్లకు తాకకుండా లైన్లను డీస్కనెక్ట్ చేయాలని సూచించారు. వినాయక నిమజ్జన రూట్లను తనిఖీ చేయాలని చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ పండుగలను విజయవంతం చేయాలన్నారు.

## విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలి



వివరాలు తెలుసుకుంటున్న వరుణ్ రెడ్డి

ములుగు రూరల్: వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుకుండా చూడాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ములుగు డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలు అందించాలని అన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారులు పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటర్‌లింక్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కన్నాయిగూడెం వరకు ఇంటర్‌లింక్ పనులను విస్తరింపచేయాలని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న 33/11కేవీ సబ్‌స్టేషన్ల పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. విద్యుత్ ఉద్యోగులు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. టీజీఎన్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్‌కు 1912కు సమస్యలు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ మల్సూర్‌నాయక్, డీఈ నాగేశ్వర్‌రావు, డీఈ సదానందం, ఏడీఈ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

# పంటలను కాపాడుకోండిలా...

- వరుస వానలతో వ్యవసాయ భూముల్లో నిలుస్తున్న నీరు
- ఆందోళనలో అన్నదాతలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న శాస్త్రవేత్తలు



చిలుకోడు సమీపంలో పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి



నీట మునిగిన వరినారును పరిశీలిస్తున్న రైతు

దోర్నకల్: వారం రోజులుగా జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాలతో పంటలలో నీరు నిల్వ ఉండి మొక్కలు వదలడం, నారు దశలో నీటి నిల్వతో మొక్కలు, వేర్లు కుళ్లిపోయే అవకాశం ఉంది. అధిక నీటి నిల్వతో ఎండుతెగులుతో పాటు ఇతర చీడపీడలు సోకే అవకాశాలు ఉన్నందున పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

**పత్తి:**
- సాధ్యమైనంతవరకు వర్షపు నీటిని తొలగించాలి.
- ఎరువుల యాజమాన్యంలో 15 నుంచి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పోటాష్‌ను వర్షం తగ్గాక వేసుకోవాలి.
- భూమిలో తేమ అధికంగా ఉంటే వేర్లు పోషకాలను తీసుకునే అవకాశం లేకపోవడంతో పైపోటుగా 20 గ్రాముల పోటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేసుకోవాలి.
- తేమ వల్ల వేరుకుళ్లు రాకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములను లీటర్ నీటితో కలిపి లేదా కార్బెండెజిమ్ మూడు గ్రాములను లీటర్ నీటితో కలిపి మొక్క మొదళ్లలో పోయాలి.

**వరి:**
- వరికి సంబంధించి ప్రస్తుతం నాట్లు కొనసాగుతున్నందున వర్షపు నీరు నిలవకుండా కాలువల ద్వారా తొలగించాలి.
- నారు దశలో ఉంటే వర్షాలు తగ్గిన తర్వాత నారు మడి కొరకు 19:19:19 పోషకాన్ని 10 గ్రాములు, కార్బెండెజిమ్, మాక్రోజెమ్‌లను 2.5 గ్రాములను నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నాటు వేసేవారు ప్రతీ 2.3 మీటర్లకు 20 సెంటీమీటర్ల మేర కాలిబాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు సోకి చీడపీడల ఉధృత్తి తగ్గుతుండటంతోపాటు ఎరువులు చల్లడానికి, సస్యరక్షణ చర్యలకు ఉపయోగపడుతుంది.

**మిరప:**
- మిరప నారుమడి దశలో ఉన్నందున వర్షపు నీటిని కాలువల ద్వారా తీసివేయాలి. నీటి నిలవ్వలు ఉంటే నారుకుళ్లు, ఎండుతెగులు సోకే అవకాశం ఉంది. నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటర్ నీటితో కలిపి మొక్క మొదలు తడిసేలా వేయాలి.

**మొక్కజొన్న:**
- వర్షాలతో పంటలో చేరిన నీటిని తొలగించాలి.
- నేల ఆరిన తర్వాత 19:19:19 లేదా 13:0:45 ఎరువును పైపాటుగా పిచికారీ చేయాలి.
- నేల ఆరిన తర్వాత అంతర్‌కృషి చేసుకుని అడుగు భాగంలో ఎరువులు వేసుకోవాలి.
- ఇతర ఆరుతడి పంటల్లో వరదనీటిని తొలగించి అంతరకృషి చేసి పైపాటుతోపాటు అడుగు భాగంలో రసాయన ఎరువులను వేసుకోవాలి.

**జాగ్రత్తలు పాటించాలి**



భారీ వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలి. పంటలతో పాటు వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి. వర్షం పడే సమయంలో వ్యవసాయ భూముల వద్ద చెట్లకింద ఉండకూడదు.

– క్రాంతికుమార్, వ్యవసాయ శాస్త్రవేత, కేవీకే మల్యాల

చీడపీడలను గుర్తించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. రాబోయే రోజుల్లో వర్షాలు పెరిగే అవకాశాలు ఉన్నందున పంటలలో కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ తీగలు, మోటార్లు, స్టార్టర్ల ఏర్పాటులో పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలను నేరుగా తాకవద్దు. వర్షంపడే సమయంలో చెట్ల క్రింద నిలబడకుండా ఇంటికి వెళ్లిపోవాలి.



## గంజాయి వ్యాపారం చేస్తున్న తండ్రీకొడుకులు

- 1.4కిలోల ఎండు గంజాయి స్వాధీనం
- తండ్రి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్సై రమేష్‌బాబు



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

నెల్లికుదురు: తండ్రీకొడుకులు కలసి అక్రమంగా విక్రయించేందుకు తరలిస్తున్న ఎండు గంజాయిని మానుకోట జిల్లా నెల్లికుదురు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. క్రాస్ రోడ్ వద్ద ఉదయం పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని విచారించగా.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగులకు చెందిన కేలోత్ చందా (కేలోత్ చందూలాల్) తన చిన్న కొడుకు కేలోత్ నవీన్‌తో కలసి తక్కువ ధరకు రాజమండ్రి నుంచి గంజాయి తీసుకొచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. దీంతో అతని వద్ద ఉన్న రూ.70 వేల విలువ చేసే 1.4కిలో గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చందాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

## వరిపొలంలో పడి రైతు మృతి



నవీన్ (ఫైల్)

మామునూరు: ఒరాలు చెక్కుతూ అకస్మాత్తుగా లోతైన వరి పొలం బురదలో ప్రమాదవశాత్తు పడడంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ 17వ డివిజన్ గాడిపెల్లికి చెందిన అమ్మ నవీన్(36) ఇంటి పక్కనే ఉన్న వరి పొలంలో ఒరాలు చెక్కేందుకు వెళ్లాడు. ఇంటిలో జరుగుతున్న ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు మధ్యాహ్నం నవీన్ భార్య ఇందుమతి ఫోన్ చేయగా రింగ్ అవుతున్నా.. లిఫ్ట్ చేయలేదు. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్దకు వెళ్లగా నవీన్ బురదలో పడి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న మామునూరు ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఇందుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- 49వ ఎడిషన్ వాటర్ సిరీస్ వెబ్‌నార్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రోగ్రాం



మాట్లాడుతున్న జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: జనగామ జిల్లాలో నీటి సంరక్షణ పెంచే దిశగా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం సత్ఫలితాలు ఇచ్చిందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జలశక్తి అభియాన్‌లో భాగంగా రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రంనుంచి జనగామ జిల్లా కలెక్టర్‌లతో మంగళవారం మంత్రిత్వశాఖ–జాతీయ జల మిషన్ డైరెక్టర్ అర్చన వర్మ ఆధ్వర్యంలో 49వ ఎడిషన్ వాటర్ సిరీస్ వెబ్‌నార్ సందర్భంగా జలశక్తి అభియాన్ ప్రగతిపై ఢిల్లీ నుంచి వర్చువల్‌గా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జనగామ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జలసంరక్షణపై దృష్టి సారించడంతో వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధించడంతోపాటు వ్యవసాయేతర రంగాల ఉత్పత్తులపై పట్టు సాధించామన్నారు. ఇంటింటికి ఇంకుడుగుంత నినాదంతో ఉద్యమంలా చేపట్టిన కార్యక్రమంతో ఐదు మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగినట్లు తెలిపారు. వరిసాగులో అత్యధిక దిగుబడి సాధించగా, ఇదే స్ఫూర్తితో వరికి ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగుపై ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. 7వేల ఎకరాలకు పైగా పామాయిల్ తోటల సాగు లక్ష్యాన్ని చేరుకోగలిగినట్లు చెప్పారు. దేవాదుల ద్వారా ప్రాజెక్టులు, చెరువులకు నీటిని నింపినట్లు చెప్పారు. రెండేళ్లుగా మత్స్యకారులు చేపల పెంపకంతోపాటు మార్కెటింగ్ పరంగా రూ.300కోట్ల నుంచి రూ.350 కోట్ల మేర వ్యాపారంతో సాధికారత సాధించారన్నారు. అనంతరం అర్చన వర్మ మాట్లాడుతూ జనగామ జిల్లా పురోగాభి వృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్‌తోపాటు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.